క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామికి శుక్రవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమైన అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఈలకొలనులో గడపగడపకూ

రంగంపేట: మండల పరిధిలోని ఈలకొలనులో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పాల్గొని గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ మూడున్నర ఏళ్ల పాలనలో గ్రామస్తులకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు.

అన్నసమారాధన

సీతానగరం: రఘుదేవపురం కోటదుర్గ సెంటర్ వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. సంక్రాంతి పండగ రోజున కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవం విరోదుల రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, శుక్రవారం అన్నసమారాధన జరిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు హాజరయ్యారు.

స్థాయికి మించి విమర్శలు తగవు

సీతానగరం: జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదని ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాపండు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై బలరామకృష్ణ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుల,మత, పార్టీలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మండలంలో పలు చర్చిల నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారని, ఇనుగంటివారిపేటలో చర్చి నిర్మాణానికి రూ.1.50 లక్షలతో స్థలం కొనుగోలు చేసి అందించారని తెలిపారు. ఇనుగంటివారిపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులతో పాటు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ నుంచి రూ.10 లక్షలు ఇవ్వడానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముందుకు వచ్చారన్నారు. బలరామకృష్ణ నోరు అదుపులో ఉంచుకుని విమర్శలు చేయడం మంచిదని, లేకుంటే తగిన విధంగా నియోజకవర్గం ప్రజలు బుద్ధి చెబుతారని సర్పంచ్ రాంపండు హెచ్చరించారు.

కాలిబాటతో అధిక దిగుబడి

- వరిసాగులో ఖర్చు ఆదా
- సస్యరక్షణ సులభం

పెదపూడి: వరిసాగులో కాలిబాటలతో ప్రయోజనాలెన్నో ఉన్నాయి. వీటివల్ల పైరుకు చీడపీడల సమస్య తగ్గుతుంది. పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుంది. చాలమంది రైతులు కాలిబాటలు వేయడానికి తటపటాయిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. ఎకరా పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 వరకు ఖర్చవుతుంది. అయితే దిగుబడి సుమారు నాలుగు బస్తాల వరకు పెరుగుదల కనిపిస్తుంది. రైతులు తప్పనిసరిగా వరిచేలల్లో కాలిబాటలు వేసుకోవాలని వ్యవసాయ అధికార్లు రైతులకు సూచిస్తున్నారు.



రాజుపాలెంలో కాలిబాటలు వేసి ఉన్న పొలం

57,442 ఎకరాల్లో వరిసాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. మండలాల వారీగా అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరంలో 8,060 ఎకరాలు సాగు చేస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకు సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న చోట నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాటిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలిబాట వేయాలి. కొందరు రైతుల ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీంతో ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీ మీటర్ల వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోచ్చు.

ప్రయోజనాలు

- కాలిబాటతో పైరు మొదళ్ల వరకు వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.
- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు ఉపయోగపడతాయి. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంటచేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.

ఎంతో ప్రయోజనం



కాలిబాటల వేయడం వల్ల దిగుబడి రెండు మూడు బస్తాలు అదనంగా వస్తుంది. అలాగే సస్యరక్షణ చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి, పెదపూడి మండలం

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని టీడీపీ నాయకుడు బర్ల బాబూరావు తెలిపారు. శుక్రవారం దేవస్థానంలో అన్నసమారాధన వద్ద బారులు తీరిన భక్తులను పరిశీలించారు. స్వామివారి పాదాల చెంత టెంట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని కోరినట్టు తెలిపారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

రాజానగరం: రాష్ట్రంలో అమల్లో ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కౌన్సిల్ డిమాండ్ చేసింది. లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమావేశమైన కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలపై చర్చించారు. తొలుత యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కౌన్సిల్ ఎన్నికలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సీహెచ్.రెడ్డియ్య, ఎల్.సుబ్బారావు, ఉపాధ్యక్షురాలిగా పి.శిరోమణి, ప్రధాన కార్యదర్శిగా ఫణికుమార్, కోశాధికారిగా శ్రీనివాసరావుతో పాటు గౌరవాధ్యక్షుడిగా దయానిధిని, 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎస్.అరుణ కుమారి, పి.జయకర్, ఎం.విజయగౌరీ, ప్రసాద్, తాతారావు, రవి బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- టీటీడీ చైర్మన్, అధికారులకు వినతి

రాజానగరం: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు నియోజకవర్గంలోని పలు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, కల్యాణ మండపాల పునఃనిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుమల వెళ్లిన ఆయన ఈ మేరకు గతంలో చేసిన విజ్ఞాపనలను ప్రస్తావిస్తూ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కలుసుకున్నారు. గత నవంబర్‌లో చేసిన ఈ ప్రతిపాదనలపై వారు కూడా సానుకూలంగానే స్పందించారన్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్స్ ఆస్పత్రి డైరెక్టర్ రెడ్డప్పరెడ్డిని కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలోకి రాని మోకాళ్ల కీళ్ల మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నియోజకవర్గం నుంచి ఇక్కడకు పంపించి, వైద్యం చేయిస్తుంటారు.



టీటీడీ అధికారులను కలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సత్కారం



కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: అనపర్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా నియమితులైన సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అడబాల వెంకటేశ్వరరావును శుక్రవారం దొడ్డిగుంట గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులిచ్చి సముచిత స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో దొడ్డిగుంట సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ మడికి లక్ష్మి, మాజీ సర్పంచ్ మల్లెల వీర రాఘవ, మాజీ ఎంపీటీసీ వారా భాస్కరరావు, పార్టీ గ్రామ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కొండేపూడి వీరవెంకటరావు, మడికి వెంకట్రావు, మల్లెల వెంకట్రావు, పంట వీరబాబు, వాసంశెట్టి నగేష్, వెంగలపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డేకి ఏర్పాట్లు

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఈనెల 26న రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం విమానాశ్రయంలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం



రహదారి ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి

అనపర్తి: రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాతవూరు బాపనమ్మ తల్లి ఆలయం నుంచి రజక వీధి, సమీప ప్రాంతంలో రూ.23.62 లక్షలతో అభివృద్ధి చేసిన రహదారిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం .. పేదల అభ్యున్నతికి దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు భరోసాగా నిలుస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. రహదారుల అభివృద్ధికి, మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అయితే ఈ రోడ్డు అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నాయకులు కుటిల ప్రయత్నాలు చేయడంతో పాటు రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టరుతో ఈ పనులకు బిల్లులు రావని బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే విమర్శించారు. జెడ్పీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, ఈ ప్రాంత నివాసితుల ఇబ్బందులకు దృష్టిలో ఉంచుకుని రోడ్డు అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకుసాగామన్నారు. కాగా.. రోడ్డు సమస్యను పరిష్కరించి ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను ఆయా ప్రాంత ప్రజలు, ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచి వారా కుమారి, వ్యాపారవేత్త కర్రి సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, వైఎస్ ఎంపీపీ కర్రి దాసు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, ఉపసర్పంచి చిర్ల వీర్రాఘవరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాస రెడ్డి, మెంబర్ నారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మే 4న కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సీటీఆర్ఐ: బూరుగుపూడిలో నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం మే 4న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తాళ్లూరు జీయర్ మఠాధిపతి పొడుగు వెంకట ప్రసాదాచార్య, శ్రీ శ్రీనివాసం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఏ.బాలాజీ వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బూరుగుపూడి సాయిబాబా ఆలయం దాటాక లోపలకు వెయ్యి గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, అందులో ఆలయ నిర్మాణం ఇప్పటికే 90 శాతం పైగా పూర్తి చేశామన్నారు. ఆలయ నిర్మాణం తదితర కార్యక్రమాలకు విరాళాలు అందించే దాతలు 94901 68555 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పంచముఖి ఆలయ నిర్మాణం ఫిబ్రవరి 3న ప్రారంభిస్తున్నామన్నారు. వెంకట ప్రసాదాచార్య స్వామీజీ మాట్లాడుతూ మే 4వ తేదీ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం నుంచి యాగశాల ప్రవేశంతో మొదలుపెట్టి 30న మండపారాధన, 108 దంపతులతో సామూహిక వ్రతాలు, అలాగే 4వ తేదీ వరకూ ఉదయం పూజలు, హోమాలు, సాయంత్రం ప్రవచనాలు ఉంటాయని వివరించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రసాదాచార్య, బాలాజీ తదితరులు

అన్నసమారాధన

బిక్కవోలు: జి.మామిడాడ రోడ్డులోని దుర్గమ్మ ఆలయం శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ఆధార్ నమోదు కేంద్రాలు

బిక్కవోలు: ఆధార్ నవీకరణకు మండలంలోని ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. 21న బలభద్రపురం 1, తొస్సిపూడి, ఇలపల్లి, అలాగే 23న బలభద్రపురం 2, కొమరిపాలెం1, తొస్సిపూడి, 24న బలభద్రపురం 3, కొమరిపాలెం 2, బలభద్రపురం1 సచివాలయాల వద్ద శిబిరాలు జరుగుతాయన్నారు. పదేళ్లలో ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'రచ్చబండ'లో మహిళలకు న్యాయం

- సొమ్ములు తిరిగిచ్చేస్తానన్న కాంట్రాక్టర్
- ఎంపీ భరత్ రామ్ చొరవతో సమస్య పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: మహిళల నుంచి రూ.39.5 లక్షలు వసూలు చేసి, కనబడకుండా తిరుగుతున్న కాంట్రాక్టర్ ఎట్టకేలకు ఎంపీ భరత్ నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో తన తప్పు ఒప్పుకున్నాడు. తనను క్షమించాలని ఎంపీ భరత్‌రామ్, మహిళలను ప్రాధేయపడ్డాడు. వారం, పది రోజుల్లో అందరికీ సొమ్ములిచ్చేస్తానని మాట ఇచ్చాడు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం వెలుగుబందలో జగనన్న ఇళ్ల కోసం పేదలకు పట్టాలిచ్చారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు క్రాంతి కుమార్ అనే కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. వెలుగుబందలో కాలనీలో ఇళ్ల స్థలాలు తీసుకున్న వారిలో సుమారు వందమంది మహిళలు ఆ కాంట్రాక్టర్‌కు రూ.50 వేల నుంచి లక్షన్నర వరకూ, ఇద్దరు ముగ్గురైతే రూ.1.75 లక్షల వరకూ ముట్టచెప్పారు. ఇలా మొత్తం సుమారు రూ.39.5 లక్షలను ఆ కాంట్రాక్టర్ వసూలు చేశాడు. కానీ పనుల్లో మాత్రం వేగం పుంజుకోలేదు. ఒకటి, రెండు నెలల్లో ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పి, ఆ తర్వాత కనబడడం మానేశాడు. ఇదంతా జరిగి ఏడాదిన్నర అవుతోంది. అతడు ఒప్పుకున్న ఇళ్ల పునాదులు, గోతుల స్థాయిలో ఉన్నాయి. ఈ విషయమై బాధిత మహిళలు ఎంపీ భరత్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒకటి, రెండుసార్లు చెప్పానని, త్వరగా ఇళ్లు కట్టేసి ఇస్తానని మాట ఇచ్చాడని, ఇంకా కట్టలేదా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్ కబురు పంపారు. దీంతో అక్కడకు చేరుకున్న కాంట్రాక్టర్‌ను చూసి బాధిత మహిళల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ భరత్ గట్టిగా హెచ్చరించే సరికీ కాంట్రాక్టర్ దారికి వచ్చాడు. వారం, పది రోజుల్లో సొమ్ములు తిరిగిచ్చేస్తానని హామీ ఇచ్చాడు. ఎంపీ భరత్‌రామ్ వెంటనే వన్ టౌన్ సీఐకు ఫోన్ చేసి సదరు కాంట్రాక్టర్ క్రాంతి కుమార్ పై ఫిర్యాదు చేశారు.

ఎంపీ భరత్ రామ్‌కు కృతజ్ఞతలు

బొమ్మూరు టిడ్కో గృహాలకు కిలోమీటరు దూరంలో క్రైస్తవులకు 4.85 ఎకరాలను శ్మశాన వాటికకు కేటాయించారు. తమ విజ్ఞప్తికి స్పందించి బరియల్ గ్రౌండ్‌కు స్థలం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సుమారు 150 క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు చెందిన పాస్టర్లు శుక్రవారం ఎంపీ కార్యాలయానికి వచ్చి ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ నిమిత్తం 4.85 ఎకరాలు, ఎస్సీల బరియల్ గ్రౌండ్ నిమిత్తం ఎకరా 5 సెంట్లు మంజూరు చేయించానన్నారు.



రచ్చబండలో కాంట్రాక్టర్ క్రాంతికుమార్‌ను నిలదీస్తున్న ఎంపీ భరత్ రామ్

కాలినడకన తిరుపతికి పయనం

రాజానగరం: అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలనే సంకల్పంతో సుమారు 600 కిలో మీటర్ల దూరంలోని తిరుమలేశుని కాలినడకన వెళ్లి దర్శించుకోవాలని నలుగురు ఆర్యవైశ్య మహిళలు నిర్ణయించుకున్నారు. ఒక పురుషుని ఆధ్వర్యంలో ప్రయాణం ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం జల్లూరు నుంచి చిత్తులూరి శ్రీదేవి, పలివెల సత్యనాగిణి, ఎం.రమాదేవి, సీహెచ్.వెంకటలక్ష్మి గురుస్వామి నవీన్ సారథ్యంలో గురువారం ఉదయం ఈ ప్రయాణం ప్రారంభించారు. జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వీరికి శుక్రవారం రాత్రి రాజానగరంలో మండవిల్లి వెంకన్నబాబు, దివాన్ చెరువులో గుప్తా మాస్టారు, బలభద్ర సత్యనారాయణ అతిథ్యమిచ్చారు. తిరుమలకు నడిచి వెళ్లాలనే తమ సంకల్పాన్ని తన భర్త చిత్తులూరి రాజాకు చెప్పగా ఆయన పూర్తి సహకారం అందించి, ప్రోత్సహిస్తున్నారని శ్రీదేవి తెలిపారు. రోజుకు 25 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నామని, 20 రోజుల్లో తిరుమలేశుని సన్నిధికి చేరుకుంటామన్నారు. దారిలో ప్రజల నుంచి ముఖ్యంగా ఆర్యవైశ్యులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.



కాలినడకన తిరుమలకు వెళుతున్న మహిళలు, గురుస్వామి

ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలి

అనపర్తి: గర్భిణులు, బాలింతల యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు ఆరోగ్యంపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి ప్రభుత్వాసుపత్రి వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నియోజకవర్గంలోని రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల పరిధిలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతాశిశు మరణాల నివారణ, ఆరోగ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రసూతి మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల విషయంలో ఏఎన్ఎంలు, ఆశలు ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతోపాటు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల మరింత శ్రద్ధ వహించి పర్యవేక్షించాలని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏరియా ఆసుపత్రిగా స్థాయి పెంపు జరిగిన అనపర్తి సర్వజన ఆసుపత్రిలో ముగ్గురు స్పెషలిస్ట్ గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లూసీ, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి, రామవరం, కుతుకులూరు, బిక్కవోలు, కొంకుదురు, రంగంపేట పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సనత్ కుమారి

గడప గడపకూ విజయవంతం చేయాలి

అనపర్తి: అనపర్తి గ్రామ సచివాలయం-3 పరిధిలో ఈనెల 22 నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. 22 నుంచి 24 వరకూ మూడు రోజులపాటు అనపర్తి సచివాలయం-3 పరిధిలోని శేషగిరిరావుపేట, సత్తివారి వీధి, వెంకటరత్నాపురం, రాముడమ్మపేట, బోడావారి వీధి తదితర ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 27న లక్ష్మీనరసాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో నిర్వహించనున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు సురకాసుల శివ, పంచాయితీ కార్యదర్శి కృష్ణారెడ్డి, పంచాయతీ పాలక మండలి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మీనరసాపురంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి

టీటీడీ ప్రచార రథానికి స్వాగతం

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూధర్మ ప్రచారం రథం శుక్రవారం పర్యటించింది. గ్రామస్తులు రథానికి ఘనంగా స్వాగతం పలికారు. రథంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి స్థానిక కనకదుర్గమ్మ ఆలయానికి రథం చేరుకుంది. శుక్రవారం ఉదయం జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ సరిపల్లి అనురాధ, ఎంపీటీసీ ఊసే ఏసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు తదితరుల ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని పూలతో అలంకరించారు.

ఉప సర్పంచి రాజీనామా

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ ఉపసర్పంచి (1వ వార్డు సభ్యురాలు) నల్లమిల్లి వినీల తన పదవికి రాజీనామా చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాజీనామాను ఎంపీడీఓ బీఎల్ నరసింహంకు అందజేశారు.

కట్నం కోసం వేధింపులు

రంగంపేట: అచ్యుతాపురానికి చెందిన సత్య పార్వతికి సుమారు పదేళ్ల క్రితం మండపేటకు చెందిన శరగం గిరిబాబుతో వివాహమైంది. పెళ్లి సమయంలో గిరిబాబుకు రూ.లక్ష, 50 సెంట్ల భూమి, రూ.ఐదు కాసుల బంగారం ఇచ్చారు. ఆ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సంతానం. కాగా.. గిరిబాబు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతడితో పాటు అతడి తల్లిదండ్రులు కూడా కట్నం తీసుకురావాలని సత్య పార్వతిని వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.